


# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

## రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే

## చివరి విడత: మలి సందడి (20)

*స్నేహానంద లహరి*

దేవ్‌దార్ చక్కని హిందీ మాట్లాడతాడు.

శ్రీమతికి హిందీ అర్థమౌతుంది కానీ, భాషమీద పట్టు అంతంత మాత్రం. పనివాళ్లతోనో, కూరగాయల బేరానికో కథ నడిపించేస్తుంది కానీ – భాష బాగా తెలిసిన ఉత్తరాదివారి దగ్గర తటపటాయిస్తుంది.

భువనేశ్వర్లో ఐతే అదంత పెద్ద సమస్య కాదు.

కొంత సైగలు, కొంత చిరునవ్వు. కొంత ఊఁ, ఆఁలు.

వీటితోపాటు పక్కన హిందీ బాగా మాట్లాడగల తెలుగువారి ఇంటర్‌ప్రెటేషన్ సహకారం.

ఈ భాషా పరిమితి శ్రీమతి వ్యక్తిత్వాన్ని రూపొందించడంలో కొంత పాత్ర వహించింది కూడా.

ఒకోసారి గుంపులో చిన్న విషయానికే వాదనలొచ్చేవి.

తన పాయింటు చెప్పడానికి భాషాజ్ఞానం చాలక, ఎదుటివారు చెప్పిందే సరైనదన్నట్లు తలాడించేది శ్రీమతి. తమతో విభేదించలేదని వాళ్లు సంతోషించేవారు.

పరభాషీయులతో విభేదించకుండా, తమతో విభేదిస్తే స్వభాషీయులు తప్పు పడతారు కదా!

అందుకని, అదే తన తత్వమైనట్లు శ్రీమతి ఎవరితోనూ వాదనకు పూనుకునేది కాదు. దాంతో ఆమెకు కాలనీలో ఆ విషయమై మంచిపేరొచ్చింది.

ప్రతివారికీ ఎవరో ఒకరిమీద అసంతృప్తి ఉంటుంది.

దాన్ని వేరెవరి దగ్గరైనా ప్రకటించేవరకూ – తృప్తి ఉండదు.

అలాంటి సందర్భాల్లో విని ఊరుకోవడం ఉత్తమం. కానీ చాలామంది, ఇరుపక్షాల్నీ విశ్లేషించి సలహాలిస్తారు. అలా ఇచ్చినప్పుడే వారికి తృప్తి.

తమ అసంతృప్తి గురించి విని, తానేమీ సలహా ఇవ్వకుండా, సానుభూతితో స్పందిస్తుందని – శ్రీమతిని కాలనీలో చాలామంది మహిళలు ఇష్టపడేవారు.

ఆ విషయం నాకు చెప్పినప్పుడు, ‘‘నాతోనూ అలా ఉంటే బాగుంటుంది కదా!’’ అన్నాను నేనోసారి.

అలాంటప్పుడు చాలామంది మహిళలు, ‘ఏం, నేను మీతో అలా ఉండడం లేదా?’ అనడం కద్దు.

కానీ శ్రీమతి రూటే వేరు. ‘‘వాళ్ల జీవితం వాళ్లది. ఇంట్లో ఈ జీవితం మనది. బాధ్యత ఉన్నచోట వాదనలు తప్పవు’’ అనేది.

పోతనామాత్యుడి పద్యాల్లో పదాల సొబగుల్లా, గృహిణుల వ్యాఖ్యల్లో జీవిత సారాన్ని వివరించే లోతైన వేదాంతపు సొబగులుంటాయి.

‘‘అది సరే కానీ, అవతలివాళ్లు ఏమన్నారో జాగ్రత్తగా విని అప్పుడు తలాడిస్తూండు. లేకపోతే నీ సానుకూలత వికటించగలదు’’ అని హెచ్చరించాను.

ఎందుకంటే – ఏ గృహిణైనా మాటల సందర్భంలో ‘నేను గయ్యాళిని. చటుక్కున ఎంత మాటపడితే అంతా అనేస్తాను’ అనొచ్చు.

అలా అనడం ఎంత ప్రమాదకరమో, నా రీసెర్చి రోజుల్లో తెలుసుకున్నాను.

అప్పుడు నలుగురు రీసెర్చి స్కాలర్సు – నేను, మూర్తి, నారాయణ, శంకర్ – నలుగురం కలిసి ఓ గది అద్దెకు తీసుకుని ఉండేవాళ్లం.

అంతా హాస్యప్రియులే. చమత్కారులే. ముళ్లపూడివారి హాస్యస్ఫూర్తికి అభిమానులే. సమయస్ఫూర్తిలో ఎవరి సాటి వారే!

ఎదుటివారిని వ్యక్తిగతమైన విమర్శలతో నొప్పించాలనే దురుద్దేశ్యం లేనంతకాలం – కేవలం హాస్యానికైతే – నొప్పించే మాటల్ని కూడా ఆస్వాదించగల సరసతా, పరస్పర విశ్వాసం అందరికీ ఉన్నాయి.

అందువల్ల ఒకటి రెండేళ్లు, అంటే విడిపోయే దాకా, మా నలుగురి స్నేహం మనోహరంగా, రసరమ్యంగా కొనసాగింది.

మాటల సందర్భంలో ఒకసారి శంకర్ పొరపాటున, 'నేనో చెత్త వెధవని కాకపోతే, వాణ్ణెలా నమ్మాను?' అన్నాడు.

వెంటనే నారాయణ టైం చూసి, 'ఫలానా సంవత్సరంలో, ఫలానా తేదీన, ఫలానా సమయానికి – శంకర్ ఉత్తి వెధవ అని తన మాటమీదనే నిర్ధారించడమైనది' అన్నాడు.

ఆ తర్వాత ఒకరోజు మూర్తి పరమమూర్ఖుడిగానూ, ఒకరోజు నేను చచ్చుఘటంగానూ, ఒకరోజు నారాయణ అడివిమాలోకంగానూ నిర్ధారించబడ్డాం.

ఈ నిర్ధారణ కార్యక్రమం కూడా క్రమంగా క్లుప్తమైపోయింది.

ఎవరైనా తన గురించి ఓ తక్కువ మాట అనగానే – ఒకరు కాలెండరు వంక, ఒకరు వాచీవంక చూస్తే – మూడోమనిషి 'కన్ఫర్మ్‌డ్' అనడం జరిగేది.

ఓ రోజున రూంలో పొరపాటున నోరు జారి, 'ఈ రోజెవరి మొహం చూశానో, లైబ్రరీలో మరీ ఆ జగన్నాధంగాడిముందు గాడిదనయ్యాను' అని శంకర్ అంటే, నేను కాలెండర్ చూశాను. తను దొరికిపోయానని శంకర్‌కి అర్థమైపోయింది.

పెద్దగా నవ్వేసి, 'తప్పయిపోయింది. ఈ సారికి వదిలెయ్యండి' అన్నాడు అభ్యర్థనగా.

కానీ మిగతావాళ్లం అతణ్ణి వదల్లేదు. నిర్దాక్షిణ్యంగా, 'గాడిద' అని కన్ఫర్మ్ చేసేశాం.

మా ఈ కన్ఫర్మేషన్ – ఓ విధంగా చాలా మేలు చేసింది. బయటవాళ్లతోనే కాదు, ఇంట్లోవాళ్లతో మాట్లాడేటప్పుడు కూడా, మమ్మల్ని మేము చిన్నబుచ్చుకునే పదాలు వాడేవాళ్లం కాదు. అలాంటి పదమేమైనా నాలుక చివరిదాకా వచ్చిందా, చెవిలో ఎవరో 'కన్ఫర్మ్‌డ్' అన్నట్లు వినిపించి, అదే హెచ్చరికయ్యేది.

మాలో మేమే కాక, ఇతరులెవరైనా మాతో కబుర్లాడుతూ, 'తన చుట్టూ కుక్కలా తిరిగాను' లాంటి వ్యాఖ్యలు చేస్తే – మాకు నవ్వాగేది కాదు.

అందులో నవ్వడానికేముందన్నట్లు వాళ్లు ఆశ్చర్యంగా చూస్తే, 'నువ్వు కనుక మాలో ఒకడివైతే – ఈపాటికి నిన్ను కన్ఫర్మ్ చేసి ఉండేవాళ్లం' అని మా సంప్రదాయం గురించి చెప్పేవాళ్లం.

దాంతో మాతో మాట్లాడేటప్పుడు ఇతరులు కూడా పదాల ఎంపికలో జాగ్రత్తగా ఉండేవాళ్లు.

ఐతే ఈ సంప్రదాయం ఇంటి ఇల్లాలి విషయంలో చెల్లదు.

మాటల సందర్భంలో 'నేను గయ్యాళిని. చటుక్కున ఎంత మాటపడితే అంతా అనేస్తాను' అని నా భార్య అనొచ్చు.

అప్పుడు నేను తను గయ్యాళి అని కన్ఫర్మ్ చేస్తే కనుక — తర్వాత అసలు సిసలు గయ్యాళితనాన్ని నిజంగా రుచి చూడాల్సి వస్తుంది.

అందుకని అప్పుడు వారితో విభేదించాలి.

'నువ్వా, గయ్యాళివా?' అని ఆశ్చర్యపోవాలి.

'అలా అన్నవారిని ఒక్కరంటే ఒక్కర్ని ఒక్కర్ని చూపించు' అని సవాలు చెయ్యాలి.

'నిన్ను కూడా గయ్యాళి అనాలంటే, ఈ లోకంలో అమాయకులకోసం ఎక్కడని వెదకాలి?' అని వాపోవాలి.

అప్పుడు సంసారం చల్లగా, చక్కగా ఉంటుంది.

ఐతే – ఇంటి ఇల్లాలితో ఎప్పుడు విభేదించాలో, ఎప్పుడు ఏకీభవించాలో తెలుసుకోవడం ఒక కళ. అందుకు ఇల్లాలి భాష తెలియాలి.

'ఔనంటే కాదనిలే, కాదంటె ఔననులే' అని ఆడవాళ్ల భాష గురించి మిస్సమ్మ సినిమాలో పింగళి వారు వ్యాఖ్యానించారు.

అది ఆ సందర్భాన్ని బట్టి ఆయనకు తోచింది చెప్పారు.

సందర్భానుసారంగా ఇల్లాలి భాష ఎలా మారిపోతూంటుందో – అది స్వానుభవాన్ని బట్టే తెలుస్తుంది.

స్వానుభవం ఎంతున్నా – ఎప్పటికప్పుడు కొత్త విద్యార్థిలా ఉంటేనే – ఆ భాష ఆకళింపుకి వస్తుంది.

'ఇన్నేళ్లుగా కాపురం చేస్తున్నాను. తన భాష నాకు తెలియదా?' అనుకుంటే అది అహంకారమే ఔతుంది.

ఆ అహంకారం గురించి హెచ్చరించడానికి మా నాన్నగారు తన స్వానుభవంనుంచి నేర్చుకున్న పాఠమొకటి మా చిన్నప్పుడు చెప్పారు.

ఆయన ఓసారి భిలాయిలో ఉండే నా మేనత్త, అంటే తన చెల్లెలి, ఇంటికెళ్లారు.

దానికి రాజమండ్రినుంచి కొంత రైలు ప్రయాణం. కొంత బస్సు ప్రయాణం.

బస్సులో ఉండగా ఆయన పక్కన కూర్చున్న ఒకతను మా నాన్నగారితో ఆగకుండా తన కష్టాలు హిందీలో చెప్పుకోవడం మొదలెట్టాడు.

తనకి హిందీ రాదని చెప్పడానికి నాన్నగారికి కొంత మొహమాటం. కొంత అహంకారం కూడా ఉందిట.

ఆయన హిందీ సినిమాలు ఎక్కువగా చూస్తారు. ఇంకా చెప్పాలంటే తెలుగుకంటే ఎక్కువగా చూస్తారు.

అప్పట్లో హిందీ సినిమాలకు హాల్లో కథ తెలుగున చెప్పేవారు. అందువల్ల సినిమా బాగానే అర్థమయ్యేది.

నటీనటుల హావభావాలు, తానెరిగిన కొన్ని హిందీ పడికట్టు పదాలు, మా ఊళ్లో రొట్టెల సాయబుతో మాటల్లో దొరల్లే ఉర్దూ పదాలు – అన్నీ కలగలిపి, తనకి హిందీ బాగా అర్థమౌతుందనే ఆయన నమ్మేవారుట.

అప్పుడు భిలాయి బస్సతను చెబుతున్నది ఆయనకి ఒక్క ముక్క కూడా అర్థం కావడం లేదుట.

కానీ అతడి హావభావాల్ని బట్టి ఓ కథ ఊహించుకున్నారుట. అతడి మాటల్ని ఆ కథకి అన్వయించుకున్నారుట. అతణ్ణి ఇంప్రెస్ చెయ్యడానికి ఎక్కడ లేని శ్రద్ధా నటించారుట. మధ్య మధ్య తలాడిస్తూ, ఊఁ ఆఁ అని అంటున్నారుట.

కొంతసేపు గడిచేక అతగాడు, ''నువ్వు వినడమే తప్ప ఏమనడం లేదు'' అని, ''క్యా బాత్ హై'' అన్నాడుట.

దానికి ఏమనాలో తెలియక, తనూ హిందీలోనే ఏదైనా అనాలనుకున్నారుట నాన్నగారు.

ఒకటి – అతడి మాటలు తనకు విసుగనిపించడం లేదని తెలియజేయాలి.

రెండు – అతణ్ణి మెచ్చుకోవాలి. అందుకని, ''శాబాష్ హై'' అన్నారుట.

అంతే!

''నేను నా కష్టాలు చెప్పుకుంటుంటే – నీకది శాబాషుగా ఉందా?'' అంటూ అతగాడు విరుచుకుపడ్డాట్ట. చుట్టుపక్కలవాళ్లు పరిస్థితి అర్థం చేసుకుని అతడికి సద్దిచెప్పి శాంతపర్చారుట.

నాన్నగారు హాస్యప్రియులు. ఈ కథ చెప్పేక, 'సినిమాల్లో మహానటులు సందర్భానుసారంగా హావభావాలు ప్రదర్శించడంలో దిట్టలు. వాళ్లే భాషలో మాట్లాడినా కథ అర్థమైపోయేది. ఈ ఖిలాయ్‌వాడికి చెప్పేది వేరు, ముఖభావాలు వేరు. అందుకని నటుడు కాని పరాయి భాషవాడితో కొంచెం జాగ్రత్తగా ఉండాలి' అని మాకు నీతి చెప్పారు.

మా నాన్నగారు చెప్పిన ఈ కథతో, 'క్యాబాత్ హై అంటే శాబాష్‌హై' అన్నది మా ఇంట్లో సామెతగా మారిందిట.

ఇప్పుడు దేవ్‌దార్ రాక ఆ కథని గుర్తు చేసింది నాకు.

భువనేశ్వర్లో ఐతే పరభాషీయులెవరైనా మా ఇంటికొచ్చినప్పుడు – పిల్లల్ని ఓసారి పరిచయం చేసి, పక్కింటికి పంపేసేవాళ్లం.

పక్కింటివాళ్లు తెలుగువాళ్లు. వాళ్ల పిల్లలూ, మా పిల్లలూ సమవయస్కులు.

ఇక్కడ అటూ, ఇటూ, పైనా, కిందా – అంతా పరదేశీయులు. ఎక్కువగా యూరోపియన్సు.

దేవ్‌దార్ ఉన్నంతసేపూ పిల్లలు కూడా మాతోనే ఉంటారు.

మా పనుల్లో మేముంటే, వాళ్లలో వాళ్లు ఆడుకుంటున్నప్పుడే, నిముషానికోసారి మావద్దకొస్తుంటారు వాళ్లు.

ఒకోసారి తమకి గొప్పదనిపించిన అనుభూతిని వెంటనే పంచుకోవాలనీ, ఒకోసారి అక్కమీద తమ్ముడికో, తమ్ముడిమీద అక్కకో పితూరీలు చెప్పడానికీ, ఒకోసారి మేము వాళ్లనొదిలి మా పనిలో మేముండడం నచ్చక!

అలాంటి వాళ్లని కాసేపైతే ఫరవాలేదు, గంటల తరబడి – మా జోలికి రాకుండా ఎలా ఆపాలన్నది మా సమస్య. వాళ్లవల్ల మా సంభాషణకి బ్రేకులు పడి, దేవ్‌దార్‌ని విసిగిస్తుందని బెరగ.

పోనీ పిల్లల్ని శ్రీమతికి అప్పజెప్పేసి – నేను, దేవ్‌దార్ కబుర్లు చెప్పుకుందామా అంటే – అతడొచ్చింది నన్ను చూడ్డానికేం కాదు, మా కుటుంబంతో పరిచయం చేసుకోవాలని.

అదీకాక – ఇంటికొచ్చిన అతిథితో నేను మాత్రమే కబుర్లు చెప్పడం – నా పద్ధతికి విరుద్ధం.

ఎందుకంటే –

తెలుగునాట దంపతుల్లో ఆడవాళ్లవీ, మగాళ్లవీ వేర్వేరు ప్రపంచాలుగా ఉండడం చిన్నప్పట్నించీ గమనించేవాణ్ణి.

సినిమాలకి కూడా వాళ్లు వాళ్ల బృందంతో, వీళ్లు వీళ్ల బృందంతో – వెడుతూండడం నాకు నచ్చేది కాదు.

నేనా పద్ధతికి భిన్నంగా ఉండాలని కాస్త గట్టిగానే అనుకునేవాణ్ణి.

రీసెర్చిస్కాలరుగా ఉన్నప్పుడు – నలుగురం కలిసి ఓ రూంలో అద్దెకుండేవాళ్లం కదా! మేమంటే చాలామందికి ప్రత్యేక ఆకర్షణ ఉండేది. కబుర్లకీ కాలక్షేపానికీ మా గదికి చాలామందే వచ్చేవారు.

వాళ్లలో స్టూడెంట్సు, రీసెర్చిస్కాలర్సు, కుర్ర లెక్చరర్లు కూడా ఉండేవారు.

కాసేపు కబుర్లయ్యేక వారిలో ఎవడో ఒకడు పేక దస్తా తీసేవాడు. అంతే!

జోరుగా, హుషారుగా పేకాట మొదలయ్యేది.

పెద్ద మొత్తాలు కాదు కానీ, అంతా డబ్బు పెట్టే ఆడేవారు.

పేకాడ్డానికి విముఖుణ్ణి కాను కానీ, డబ్బెట్టి ఆడకూడదన్న నియమాన్ని చిన్నప్పుడే నాకు నేనే విధించుకుని చాలా పద్ధతిగా అనుసరిస్తున్నాను.

ఆ విషయంలో నేనెంత ఖచ్చితమో తెలిసినా, అప్పుడప్పుడు మిత్రులు బలవంతపెట్టేవారు. లొంగలేదని కొందరు నొచ్చుకునేవారు.

అప్పుడు వాళ్ల ముఖాలు చూస్తే చాటున నా గురించి గొణుక్కోవచ్చనిపించేది.

రూంమేట్స్ నన్ను సమర్థించడానికి, ''అతణ్ణి మరీ బలవంతపెట్టకండి. రూంలో పేకాడ్డానికి వీల్లేదని శాసింగలడు'' అని, అక్కడ పేకాడ్డానికి నా అనుమతీ అవసరమనీ, మాటవరసకి కూడా నేను వాళ్లని అభ్యంతర పెట్టలేదనీ పరోక్షంగా సూచించేవారు.

ఏదేమైనా ఎవరితోనూ నా స్నేహానికి భంగం వాటిల్లలేదు.

అలా నేనెప్పుడూ మా రూంలో పేకాట కార్యక్రమానికి ప్రేక్షకుణ్ణి మాత్రమే.

ఆ పేకాటలో పాల్గొనే వారిలో ఇద్దరుముగ్గురు వివాహితులు కూడా ఉన్నారు.

పేకాట పేరిట వాళ్లొకోసారి రాత్రి ఒంటిగంట దాకా ఇక్కడే ఉండిపోయేవారు.

ఒకసారి నేనో లెక్చరర్ మిత్రుడివద్ద ఆ విషయం ప్రస్తావించి, ''ఇంట్లో భార్యని ఒంటరిగా వదిలేసి, నువ్విక్కడ పేకాటలో ఉండిపోవడం బాగుందా'' అని మందలించాను.

అతగాడు వెంటనే, ''తననీ రమ్మన్నానయ్యా! రాను కాక రానంటుంది. వాళ్లకీ ఓ ఆడాళ్ల బ్యాచుందిలే, వాళ్ల ప్రోగ్రామ్సు వాళ్లవి. మన ప్రోగ్రాంసు మనవి. అదంతే! పెళ్లయి కాపురం పెట్టేక నీకూ తెలుస్తుందిలే'' అన్నాడు.

అది నిజమే!

అతగాడింట్లో ఒకటి రెండుసార్లు భోజనం కూడా చేశాను.

ఆ దంపతుల అన్యోన్యతలో నాకేం లోటు కన్పించలేదు.

ఐనా నేను మాత్రం, పెళ్లయి కాపురం పెట్టేక, ఇంటా బయటా మేమెప్పుడూ జంటగానే ఉండాలనుకున్నాను. శ్రీమతి ఆ విషయంలో నాకు పూర్తిగా సహకరించడంతో, పాటించడానికి మాకే ఇబ్బందీ కలుగలేదు.

పెళ్లయిన రెండేళ్లకి వైజాగునుంచి భువనేశ్వర్ వచ్చేక కూడా – మా పద్ధతి అలాగే కొనసాగింది.

అక్కడ అంతా మమ్మల్ని అనుసరించారో, లేక మేమే అక్కడి ప్రవాహంలో కలిసిపోయామో తెలియదు కానీ – మా జంటతనం నిరాటంకంగా కొనసాగింది.

పేరంటాలు, ఆఫీసు వ్యవహారాలు లాంటివైతే తప్ప – ఇంటికి ఎవరొచ్చినా కబుర్లలో భార్యాభర్తలిద్దరూ పాల్గొనడం అక్కడ ఆచారమైపోయింది. అలా జరక్కపోతే, వచ్చినవాళ్లు నొచ్చుకోకుండా సహేతుకమైన సంజాయిషీ ఇవ్వడం బాధ్యతగా ఫీలయ్యేవాళ్లం.

అందుకే దేవదార్ గురించి నేను ఆలోచనలో పడితే, ''అంత అభిమానంగా చూడ్డానికొస్తున్నాడు. వీలైనంత వరకూ మానేజ్ చేద్దాం. కుదరలేదూ! నాకు తెలిసి మీ మిత్రులంతా మంచివాళ్లే. అతనా మాత్రం అర్థం చేసుకుంటాడు లెండి'' అంది శ్రీమతి.

ఆలోచిస్తే ఎంత చిన్న విషయమైనా పెద్ద సమస్యగా అనిపిస్తుంది.

ఆలోచించకపోతే ఎంత పెద్ద సమస్యయినా తేలికగా తోస్తుంది.

మనిషికి ఆలోచనతో పాటు – అదెప్పుడు అవసరమో, ఎప్పుడు కాదో తెలుసుకునే విచక్షణ కూడా ఉండాలి.

శ్రీమతి అన్న ఆ మాట – నాకు కొంత విచక్షణను ప్రసాదించింది.

అప్పుడు దేవ్‌దార్‌కోసం ఏంచెయ్యాలీ, అతణ్ణి ఎలా ఆదరించాలీ అన్నవాటిమీద దృష్టి పెట్టాం.

దేవ్‌దార్ ఉదయం పదికి వస్తానన్నాడు.

అది మాకు వీలైన సమయమే! ఎందుకంటే – ఒకోసారి ఉదయం ఎనిమిది తర్వాత కానీ ఇంటామె ఒలోముచ్‌కీ కిచెన్‌లోకి రాదు. ఆలోగా మా టిఫిన్లైపోవాలి.

తను మళ్లీ పది దాటేక బయటికెడుతుంది. అప్పుడే మళ్లీ కిచెన్ వాడుకోగలం.

ఆతర్వాత మళ్లీ రాత్రి ఎనిమిది దాకా తను ఇంటికి రాదు.

మా అదృష్టం – ఆ రోజు ఎనిమిదికే బయటికెడతానంది ఒలోముచ్‌కీ.

ఆమె వెళ్లగానే టిఫిన్ తయారీకి వెడదామనుకున్నాం.

దేవ్‌దార్ మరాటీ కదా అని శ్రీమతి పూరీ కూర ప్లాన్ చేసింది.

ముందు రోజు రాత్రే బంగాళా దుంపలు ఉడకబెట్టి ఫ్రిజ్‌లో ఉంచింది.

ఉదయం బ్రషింగ్ అవగానే నేను ఉల్లిపాయలు వగైరాలు తరుగుతుంటే, తను పూరీ పిండి కలిపింది.

ఇద్దరున్నాం. ఒలోముచ్‌కీ ఇలా వెళ్లగానే అలా పూరీలు, కూర చేసెయ్యచ్చనుకున్నాం.

కానీ ఆ రోజు ఒలోముచ్‌కీ డ్యూటీకి వెళ్లేసరికి 8.55 అయింది.

నేను కొంచెం కంగారు పడ్డాను కానీ శ్రీమతి హుషారుగానే ఉంది.

''మనం చాలా స్పీడు. అరగంటలో టిఫిన్ రెడీ. ఆ తర్వాత అరగంటసేపు మనకి కాళీ. ఎవరికోసమైనా ఎదురుచూడ్డం మహా బోరు కదా, ఆ అరగంటకోసం ఏమైనా ప్లాన్ చెయ్యండి'' అంది తను.

నేను టెన్షన్లో ఉన్నాననిపించినప్పుడు, పరిస్థితిని ఇలా తేలిక చెయ్యడం తనకి అలవాటు.

తనలా అనగానే చాలా రిలాక్సయ్యాను. ''నేను ప్లాన్ చెయ్యడమెందుకూ – బోరు చూపినవాడే, దారీ చూపిస్తాడు. అన్నింటికీ అ దేవుడిమీదే భారం వేద్దాం'' అన్నాను.

అలా ఎందుకన్నానో! భారం దేవుడిమీద వేస్తే – అది దేవ్‌దార్ తీసుకున్నాడు.

సరిగ్గా తొమ్మిదికి కాలింగ్‌బెల్ మ్రోగితే, ఎవరు చెప్మా అనుకుంటూ వెళ్లి తలుపు తీశాను.

గుమ్మంలో దేవ్‌దార్!

నా కళ్లని నేనే నమ్మలేకపోయాను. పదికి వస్తానన్నవాడు తొమ్మిదికే వచ్చేశాడు.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments